ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

విశాఖపట్నం కేంద్రం

జాతీయ వార్తలు

తేదీ: 01-06-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ భారత్ లో పర్యటిస్తున్న మయన్మార్ అధ్యక్షుడు యూ మిన్ ఆంగ్ హ్లైంగ్ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోదీలతో ఈరోజు సమావేశమయ్యారు.
- ❖ భారత్ - ఒమన్ దేశాల మధ్య గత ఏడాది కుదిరిన సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం (CEPA) నేటి నుండి అమల్లోకి వచ్చింది.
- ❖ దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ నిల్వలు తగినంత అందుబాటులో ఉన్నాయని ప్రభుత్వం స్పష్టం చేసింది.
- ❖ రాజ్యసభలో ఇటీవల ఖాళీ అయిన 24 స్థానాలను భర్తీ చేసేందుకు భారత ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేసింది.
- ❖ నైరుతి రుతుపవనాలు రాబోయే రెండు మూడు రోజుల్లో కేరళం తీరాన్ని తాకే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (IMD) అంచనా వేసింది.

======================

భారత్ లో పర్యటిస్తున్న మయన్మార్ అధ్యక్షుడు యూ మిన్ ఆంగ్ హ్లైంగ్ ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో న్యూఢిల్లీలో ఈరోజు సమావేశమయ్యారు. ఇరు దేశాల మధ్య చారిత్రక, నాగరిక సంబంధాలను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ సందర్భంగా ద్వైపాక్షిక చర్చలు జరిపారు. ముఖ్యంగా వాణిజ్యం, పెట్టుబడులు, అభివృద్ధి సహకారం, ఆరోగ్యం, విద్య, ఇంధనం వంటి రంగాలలో సహకారాన్ని పెంపొందించుకోవడానికి ఇరు పక్షాలు ఆసక్తి చూపాయని సమావేశం అనంతరం విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ పాత్రికేయులకు వెల్లడించారు. మయన్మార్ అధ్యక్షుడి పర్యటన రెండు దేశాల శ్రేయస్సు కోసం కలిసి పని చేయడానికి ఇరుపక్షాల ఉమ్మడి నిబద్ధతను మరోసారి పునరుద్ఘాటించిందని ఆయన వివరిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

ప్రధానితో సమావేశం అనంతరం రాష్ట్రపతి భవన్ చేరుకున్న మయన్మార్ అధ్యక్షుడు ఈ సాయంత్రం రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిశారు. ఇక రేపు పలు వ్యాపార, పారిశ్రామిక కార్యక్రమాలు, క్షేత్ర పర్యటనల కోసం ముంబై నగరానికి వెళ్లనున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

భారత్ - ఒమన్ దేశాల మధ్య గత ఏడాది కుదిరిన సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం (CEPA) ఈరోజు నుండి అమల్లోకి వచ్చింది. 2025 డిసెంబర్ 18న మస్కట్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఒమన్ రాజు సుల్తాన్ హైతమ్ బిన్ తారిక్ అల్ సయిద్ సమక్షంలో ఈ ఒప్పందంపై సంతకాలు జరిగాయి. పలు దఫాల సమీక్షల అనంతరం ఈ ఒప్పందం నేటి నుండి అమల్లోకి వచ్చిందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ న్యూఢిల్లీలో పాత్రికేయులకు వెల్లడించారు. ఒమన్‌తో భారతదేశ సంబంధాలలో ఇది ఒక కీలకమైన మైలురాయిగా నిలుస్తుందన్నారు. రైతులు, మత్స్యకారులు, యువత, మహిళలు, పారిశ్రామికవేత్తలు, MSMEలకు ప్రయోజనాలను అందించే వాణిజ్య భాగస్వామ్యాలను ఈ ఒప్పందం పెంపొందిస్తుందని పీయూష్ గోయల్ వివరిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = =

దేశంలో 24 రాజ్యసభ స్థానాలను భర్తీ చేసేందుకు భారత ఎన్నికల సంఘం ఈరోజు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, గుజరాత్ రాష్ట్రాల్లో నాలుగేసి స్థానాలకు రాజ్యసభ ఎన్నికలు జరగనుండగా... రాజస్థాన్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో మూడేసి స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. జార్ఖండ్‌లో రెండు రాజ్యసభ స్థానాలు ఖాళీగా ఉన్నాయి. ఈ స్థానాలన్నింటినీ భర్తీ చేసేందుకు నామినేషన్లు కోరుతూ ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేసింది. జూన్ 8వ తేదీ వరకూ అభ్యర్థులు తమ నామినేషన్లు దాఖలు చేయాలని నోటిఫికేషన్‌లో పేర్కొంది. ఈ నెల 11వ తేదీ వరకూ అభ్యర్థులు తమ నామినేషన్లను విత్ డ్రా చేసుకునేందుకు గడువు ఇచ్చింది. జూన్ 18వ తేదీన ఈ 24 రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ పోలింగ్.. అదే రోజు సాయంత్రం 5 గంటల నుంచి ఓట్లను లెక్కించి తుది ఫలితాలను వెల్లడించనుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = =

పీఎం స్వనిధి పథకం ఆరేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా లబ్దిదారులందరికీ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలిపారు. దేశవ్యాప్తంగా వీధి వ్యాపారుల జీవితాలను మార్చడంలో పీఎం స్వనిధి పథకం విశేషంగా దోహద పడిందని అన్నారు. ఈ పథకం ద్వారా అనేక మంది వీధి వ్యాపారులకు పూచీకత్తు లేని రుణాలు లభించాయని ప్రధానమంత్రి వెల్లడించారు. పీఎం స్వనిధి అనేది విశ్వాసం, గౌరవం, సాధికారతల పునాదిపై ఆధారపడిన పథకమని స్పష్టం చేశారు. పీఎం స్వనిధి పథకం లబ్దిదారుల ప్రయత్నాలు దేశ ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేస్తున్నాయని సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ప్రధానమంత్రి పేర్కొన్నారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = =

దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ నిల్వలు తగినంత అందుబాటులో ఉన్నాయని ప్రభుత్వం పునరుద్ఘాటించింది. పశ్చిమాసియాలోని తాజా పరిణామాలపై న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన అంతర్ మంత్రిత్వ శాఖల మీడియా సమావేశంలో పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ సుజాత శర్మ మాట్లాడుతూ... సరఫరా సజావుగా సాగేందుకు ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు అన్ని రిటైల్ అవుట్‌లెట్లలో పెట్రోల్, డీజిల్‌ను అందుబాటులో ఉంచుతున్నాయని తెలిపారు. ఎల్‌పిజి, పెట్రోల్, డీజిల్ అమ్మకాలు పంపిణీలో జరిగే అక్రమ నిల్వలు, అవకతవకలపై

నిఘాను పటిష్టం చేయాలని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను ప్రభుత్వం కోరినట్లు చెప్పారు. గత మూడు రోజుల్లో 1,300 దాడులు నిర్వహించి ఏడుగురిని అరెస్టు చేసినట్లు సుజాత శర్మ వెల్లడిస్తూ...

(వాయిస్ 28 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = =

నీట్-యూజీ 2026 పునఃపరీక్షను `కంప్యూటర్ ఆధారిత పరీక్ష` (సీబీటీ) విధానంలో నిర్వహించాలని ఆర్.జే. డీ. ఎంపీ సుధాకర్ సింగ్ దాఖలు చేసిన పిటిషన్‌ను స్వీకరించడానికి సుప్రీం కోర్టు నిరాకరించింది. ప్రస్తుతం ఉన్న పెన్ అండ్ పేపర్ విధానంలోనే నీట్ పునఃపరీక్ష నిర్వహించాలని జస్టిస్ పీ.ఎస్. నరసింహ, జస్టిస్ అరవింద్ కుమార్‌లతో కూడిన ధర్మాసనం ఉత్తర్వులు ఇచ్చింది. అకస్మాత్తుగా పరీక్షా విధానాన్ని మార్చడం ఆచరణాత్మకంగా కష్టమని ధర్మాసనం అభిప్రాయపడింది. సమయాభావం, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ఇటీవల ఎదుర్కొంటున్న సవాళ్లను పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపింది. ఎంపీ సుధాకర్ సింగ్ సహా, ఇతరులు దాఖలు చేసిన పలు పిటిషన్లపై విచారణను సుప్రీంకోర్టు ఈ నెల 27కు వాయిదా వేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = =

మధ్యప్రదేశ్‌లోని రైసెన్ జిల్లాలోని రమాసియా గ్రామం నుండి 'ఖేత్ బచావో అభియాన్' ప్రచార కార్యక్రమాన్ని కేంద్ర వ్యవసాయం, రైతు సంక్షేమ శాఖా మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఈరోజు ప్రారంభించారు. ఈ ప్రచారం దేశవ్యాప్తంగా నెల రోజుల పాటు నిరంతరాయంగా కొనసాగనుంది. వ్యవసాయ భూములను పరిరక్షించడం, రైతులలో శాస్త్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం. ప్రచారం ప్రారంభం సందర్భంగా శివరాజ్ సింగ్ చౌహాన్ మాట్లాడుతూ... నేలను పరిరక్షిస్తే వ్యవసాయం వర్ధిల్లుతుందని... తద్వారా రైతులు మరింత బలపడి దేశం సుసంపన్నమవుతుందన్నారు. సమతుల్య ఎరువుల వాడకం, నేల పరీక్షలు, నేల ఆరోగ్య కార్డులు, సహజ వ్యవసాయం, నీటి సంరక్షణ, శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించాలని ఆయన ఈ సందర్భంగా రైతులకు పిలుపునిచ్చారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

నైరుతి రుతుపవనాలు రాబోయే రెండు మూడు రోజుల్లో కేరళం తీరాన్ని తాకే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (IMD) తెలిపింది. ఈ ఏడాది ఎల్ నినో ప్రభావం వల్ల తక్కువ వర్షపాతం ఉండవచ్చని అంచనా వేసినప్పటికీ... ప్రస్తుతం రుతుపవనాలు బలంగానే ప్రారంభం కానున్నాయని వెల్లడించింది. రుతుపవనాల రాక నేపథ్యంలో ఈరోజు నుండి రాబోయే ఐదు రోజుల పాటు కేరళం అంతటా అతి భారీ వర్షాలు కురుస్తాయని ఐఎండీ హెచ్చరించింది. అదే విధంగా ఈశాన్య రాష్ట్రాలైన నాగాలాండ్, మణిపూర్, త్రిపురలతో పాటూ... ఒడిశా, కర్ణాటక, తమిళనాడు, పుదుచ్చేరిలలో రేపు భారీ వర్షాలు కురుస్తాయని ఐఎండి అంచనా వేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = =

హాంకాంగ్ వేదికగా జరిగిన 22వ ఆసియా అండర్-20 అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో భారత్ చారిత్రాత్మక రికార్డు నెలకొల్పింది. ఈ టోర్నమెంట్‌లో భారత్ మొత్తం 19 పతకాలను సాధించి.. పతకాల పట్టికలో రెండో స్థానాన్ని కైవసం చేసుకుంది. ఈ 19 పతకాలలో 10 స్వర్ణాలు, 5 రజతాలు, 4 కాంస్య పతకాలు ఉన్నాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = =